సాక్షి
రంగారెడ్డి
మంగళవారం । 14 । అక్టోబర్ । 2025



క్రాప్ సర్వేతో మేలు

రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను సమగ్రంగా తెలుసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ ప్రారంభమైంది. 8లో▸



ఇలా వచ్చి..అలా వెళ్లిపోయి!

డీసీసీ అధ్యక్ష ఎన్నికపై నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే కాలె యాదయ్య ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. 8లో▸



అక్రమ కట్టడాలు..

పాత మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే రోడ్డులో అక్రమ కట్టడాలను తొలగించాలని కమిషనర్‌కు విన్నవించారు. 8లో▸

న్యూస్‌రీల్

సీఎంను కలిసిన బీజేపీ నేత ఆచారి



ఆమనగల్లు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బీజేపీ నేత, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఆచారి మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో కలిసిన ఆచారి ఈనెల 31న జరిగే తన కుమారుడు భరత్ నిశ్చితార్థానికి రావాలని ఆహ్వానించారు. నాలుగు మండలాల కూడలి అయిన ఆమనగల్లు అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని, అన్ని డివిజన్ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. అంతకుముందు ముఖ్యమంత్రిని సత్కరించారు.

ముఖ్యమంత్రిని కలిసిన ఆసీఫ్‌అలీ

కడ్తాల్: సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మండల కేంద్రానికి చెందిన రేవంత్‌మిత్ర మండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆసీఫ్‌అలీ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రేవంత్‌మిత్ర మండలి ఆధ్వర్యంలో చేపడుతున్న సామాజిక కార్యక్రమాల గురించి వివరించారు.

ముగిసిన హార్స్ రైడింగ్ పోటీలు




హార్స్ రైడింగ్ చేస్తున్న క్రీడకారుడు

శంకర్‌పల్లి: మండల పరిధిలోని జన్వాడలో ఉన్న నాసర్ పోలో హార్స్ రైడింగ్ అకాడమీలో మూడు రోజుల పాటు నిర్వహించిన హైదరాబాద్ హార్స్ షో మాన్సూన్–2025 చాంపియన్ పోటీలు సోమవారం ముగిశాయి. షో జంపింగ్, డ్రెసాజ్ విభాగాల్లో ఈ పోటీలను అండర్–10, –12, –14, –16 ఓపేన్ కేటగిరీల్లో నిర్వహించగా సుమారు 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు నాసర్ పోలో హార్స్ రైడింగ్ అకాడమీ చైర్మన్ కుతుబుద్దీన్ ఖాన్ బహుమతులు అందజేశారు.

నేడు డయల్ యువర్ డీఎం

షాద్‌నగర్‌రూరల్: ఆర్టీసీ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు షాద్‌నగర్ డిపో మేనేజర్ ఉష సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రయాణికులు తమ సమస్యలు, సూచనలు, సలహాలను తెలియజేయాలని కోరారు. 99592 26287 నంబర్‌లో సంప్రదించాలని ఆమె సూచించారు.

డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన వీణకు శిక్షణ



శిక్షణకు వచ్చిన వీణ

ఇబ్రహీంపట్నం: గ్రూప్–1 ఫలితాల్లో డిప్యూటీ కలెక్టర్‌గా (ఆర్డీవో స్థాయి) ఎంపికైన నారాయణపేట జిల్లాకు చెందిన ఎస్.వీణ శాఖాపరమైన శిక్షణ పొందేందుకు ఇబ్రహీంపట్నం రెవెన్యూ కార్యాలయానికి అలాట్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాయానికి వచ్చిన వీణ తహసీల్దార్ సునీతారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్‌ను కలిశారు. మూడు వారాల పాటు జీపీఓగా, వారం పంచాయతీ కార్యదర్శిగా, మూడు వారాల పాటు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా ఆమె శిక్షణ పొందనున్నారు.

లోడ్ లారీలతో రోడ్లు ధ్వంసం

పహాడీషరీఫ్: జల్‌పల్లి పరిసరాల్లో రాత్రి పూట అక్రమంగా తిరుగుతున్న మట్టి, బండరాళ్ల లారీలతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొన్ని రోజులుగా గ్రామ శివారులోని భారీ క్వారీని పూడ్చేందుకు కొందరు రాత్రి పూట వందల సంఖ్యలో ఇతర ప్రాంతాల నుంచి బండరాళ్లు, మట్టిని తీసుకొస్తున్నారు. ఎవరూ చూడరనే ఉద్దేశంతో భారీ లారీల్లో ప్రమాదపుటంచున నింపి తరలిస్తుండడంతో బండరాళ్లు కింద పడిపోతున్నాయి. మామిడిపల్లి రోడ్డులో అర్ధరాత్రి బండరాయి కింద పడడంతో వెనుకాల వస్తున్న కారు డ్రైవర్ అప్రమత్తంగా ఉండడంతో ప్రమాదం తప్పింది. భారీ లోడ్ బండ్లతో కొత్తగా వేసిన రోడ్లు సైతం దెబ్బ తింటున్నాయని వాహనదారులు మండిపడుతున్నారు. దీనిపై బాలాపూర్ మండల రెవెన్యూ అధికారులు, పహాడీషరీఫ్ పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సోలార్ సొబగులు!

పీఎం సూర్యఘర్ పథకానికి నందిగామ ఎంపిక

- రూ.కోటితో ప్రభుత్వ ఆఫీసులపై ప్యానళ్ల ఏర్పాటు
- నెలరోజుల్లో డీపీఆర్ సిద్ధం చేయనున్న టీజీ రెడ్‌కో
- 'మోడల్ సోలార్ విలేజ్'గా అభివృద్ధి చేయనున్న ప్రభుత్వం



సాక్షి, రంగారెడ్డిజిల్లా/ షాద్‌నగర్: జిల్లాలోని నందిగామ సిగలో ఇక సోలార్ వెలుగులు విరజిమ్మనున్నాయి. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆ గ్రామంలోని ప్రభుత్వ ఆఫీసులు, విద్యా సంస్థలు, ఆస్పత్రులు, సంక్షేమ హాస్టళ్లు, రక్షకభట నిలయాలు ఇక పూర్తిగా సోలార్ విద్యుత్ కాంతులతో వెలిగిపోనున్నాయి. ఇందుకు సంబంధించిన సమగ్ర నివేదిక (డీపీఆర్)ను టీజీ రెడ్‌కో నెల రోజుల్లో సిద్ధం చేసి, కేంద్ర సంప్రదాయ ఇంధన వనరుల మంత్రిత్వశాఖకు అందజేయనుంది. ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే ఆయా ప్రభుత్వ భవనాలపై ప్యానళ్లు ఏర్పాటు చేయనున్నారు.

మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దేందుకు..

సోలార్ విద్యుత్‌ను పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రూ.800 కోట్ల ఖర్చుతో దేశవ్యాప్తంగా 800 గ్రామాలను 'సోలార్ మోడల్ విలేజ్'లుగా తీర్చి దిద్దాలని నిర్ణయించింది. ఇందుకు 2011 జనాభా లెక్కల ప్రకారం ఐదు వేల జనాభా కలిగి ఉండాలనే నిబంధన విధించింది. ఈ మేరకు జిల్లాలోని ఆరుట్ల, అబ్దుల్లాపూర్‌మెట్, పాల్మాకుల, మాడ్గుల, షాబాద్, మహేశ్వరం, దండు మైలారం, రాయపోలు, ఇన్ముల్‌నర్వ, కడ్తాల్, ఆలూరు, చేవెళ్ల, కొందుర్గు రెవెన్యూ విలేజీలను గుర్తించి, సర్వే చేపట్టింది. ఇప్పటికే సోలార్ విద్యుత్‌పై అవగాహన కలిగి ఉండి, ప్రభుత్వ, ప్రైవేటు భవనాలపై ప్యానళ్ల ఏర్పాటు చేసుకుని మెజార్టీ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్న నందిగామను మోడల్ విలేజ్‌గా ఎంపిక చేసింది.

పోటీపడిన మరో 13 గ్రామాలు..

షాబాద్‌లో రెండు యూనిట్ల ద్వారా ఇప్పటికే 21 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి అవుతుండగా, మహేశ్వరంలో ఎనిమిది యూనిట్ల నుంచి 670, చేవెళ్లలో 17 యూనిట్ల నుంచి 87.2, రాయపోలులో మూడు యూనిట్ల నుంచి 37, కడ్తాల్‌లో తొమ్మిది యూనిట్ల నుంచి 87.3, ఆలూరులో మూడు యూనిట్ల నుంచి 12, కొందుర్గులో మూడు యూనిట్ల నుంచి 1,009 మెగావాట్ల చొప్పున విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. నందిగామలో పది యూనిట్ల నుంచి ఏకంగా 1,939 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతున్నట్లు గుర్తించి పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసింది. నెల రోజుల్లో సమగ్ర నివేదికను రూపొందించి ఎంఎన్ఆర్‌కు పంపనుంది.

25 ప్రభుత్వ భవనాల గుర్తింపు

అన్ని అనుమతులు వచ్చిన తర్వాత టెండర్ల ద్వారా ఏజెన్సీలను ఎంపిక చేయనుంది. రూ.కోటి ఖర్చుతో ప్రభుత్వ ఆస్పత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, పంచాయతీ, మండల కార్యాలయాలు, ప్రభుత్వ సంస్థల గిడ్డంగులు సహా సుమారు 25 ప్రభుత్వ భవనాలపై కిలో వాట్ నుంచి మూడు కిలోవాట్ల సామర్థ్యంతో కూడిన సోలార్ పలకలను అమర్చనుంది. ప్రభుత్వ భవనాలపై పూర్తి ఉచితంగా ప్యానళ్లు ఏర్పాటు చేయనుండగా, స్వయం సహాయ సంఘాల భవనాలకు 10 శాతం ఆర్థిక సహాయం అందించనుంది. ఆయా భవనాలపై ఉత్పత్తి అయిన విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానించనుంది. దీంతో నెలవారీ విద్యుత్ బిల్లుల భారం నుంచి ఆయా ప్రభుత్వ కార్యాలయాలకు విముక్తి కల్పించనుంది.

ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ ఇలా

సామర్థ్యం	ప్రభుత్వ సబ్సిడీ	విద్యుత్ ఉత్పత్తి
ఒక కిలోవాటు	రూ.30 వేలు	120 యూనిట్లు
రెండు కిలోవాట్లు	రూ.60 వేలు	240 యూనిట్లు
మూడు కిలోవాట్లు	రూ.78 వేలు	360 యూనిట్లు

గృహాలకు సబ్సిడీ

ప్రభుత్వ భవనాలపైనే కాకుండా గ్రామంలోని తమ ఇళ్లపై ప్యానల్స్ ఏర్పాటు చేసుకోవాలని భావించే గృహ వినియోగదారులకు కూడా ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోంది. ఒక కిలోవాట్ నుంచి మూడు కిలోవాట్ల ప్లాంట్ ఏర్పాటు వరకు సబ్సిడీ ఇస్తుంది. ఇంటిపై సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకోవాలని భావించే వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. https:// pmsuryaghar. gov. in పోర్టల్‌లో లాగిన్‌ై ఇంటికి సంబంధించిన విద్యుత్ మీటర్ యూఎస్సీ నంబర్‌ను ఎంటర్ చేస్తే వివరాలు వస్తాయి. దీని ద్వారా ఎన్ని కిలోవాట్స్ సోలార్ పరికరాలు అవసరమనే వివరాలను నమోదు చేయాల్సి ఉంది. తర్వాత విద్యుత్‌శాఖ అధికారులు పరిశీలించి యూనిట్ ఏర్పాటుకు అనుమతులు జారీ చేస్తారు. ఇంటిపై ప్రభుత్వ సబ్సిడీతో ఏర్పాటు చేసుకున్న సోలార్ ప్యానల్స్‌తో గృహ విద్యుత్ బిల్లులను తగ్గించుకోవడంతో పాటు పెట్టిన పెట్టుబడిని.. ఐదేళ్ల వ్యవధిలోనే తిరిగి పొందొచ్చు. ఇలా ఒకసారి ఏర్పాటు చేసిన ప్యానల్స్ 25 ఏళ్ల పాటు విద్యుత్‌ను ఉత్పత్తి చేయనున్నట్లు టీజీ రెడ్‌కో జిల్లా మేనేజర్ టి.వేణుగోపాల్ తెలిపారు.



ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఎరువుల కొరత లేకుండా చూడాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ సి. నారాయణరెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పత్తి,వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సరిపడా గన్నీ బ్యాగులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లకు ఫేజ్‌లవారీగా బిల్లులు ఇచ్చేలా చూడాలన్నారు. గ్రామ, మున్సిపాలిటీ స్థాయిలో పారిశుద్ధ్యంపై శ్రద్ధ పెట్టాలని తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలులో జిల్లాను ముందు ఉంచేలా కృషి చేయాలన్నారు.

ప్రజావాణికి 48 దరఖాస్తులు

ప్రజావాణికి వచ్చే ఫిర్యాదుల విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన నేరుగా అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి 48 అర్జీలు అందినట్టు తెలిపారు. వాటిని పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చిన్నారులకు పోలియో చుక్కలు

తుక్కుగూడ:పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు.కలెక్టర్ కార్యాలయంలో సోమవారం చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మిగిలిపోయిన పిల్లలను గుర్తించి వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి పోలియో చుక్కలు వేయాలన్నారు. పౌల్ట్రీఫామ్‌లు, ఇటుక బట్టీలు, భవన నిర్మాణాల వద్ద చిన్నారులను విస్మరించొద్దని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులకు సవాల్‌గా దోపిడీ ఘటన

- ప్రత్యేక బృందాల ఏర్పాటు?

అబ్దుల్లాపూర్‌మెట్: మండల కేంద్రంలో ఉన్న బ్రిలియంట్ ఇంజినీరింగ్ కళాశాలలో రూ.1.07 కోట్లు దోపిడీకి పాల్పడిన దొంగలను పట్టుకునేందుకు పది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఇటీవల అర్ధరాత్రి కళాశాల కార్యాలయంలోకి ప్రవేశించిన దోపిడీ దొంగలు ఎలాంటి ఆధారాలు దొరక్కుండా చోరీ చేసి పోలీసులకు సవాల్ విసిరిన సంగతి తెలిసిందే. ఇంత పెద్ద మొత్తంలో దోపిడీకి పాల్పడిన దుండుగులు పాత నేరస్తులై ఉండొచ్చని, వివరాలను సేకరించే పనిలో పడ్డారు. నగదు దోపిడీకి పాల్పడడంతో పాటు సీసీ కెమెరాల డీవీఆర్‌లను అపహరించడాన్ని పరిశీలిస్తే దొంగతనాల్లో ఆరితేరిన వారై ఉంటారని భావిస్తున్నారు. కళాశాల పరిసరాలతో పాటు జాతీయ రహదారి సమీపంలో ఉన్న వివిధ సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం.



దోపిడీ జరిగిన బ్రిలియంట్ కళాశాల

విద్యుత్ లైన్ అలైన్‌మెంట్ మార్చేలా చూడండి

- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు బాధిత రైతుల వినతి

కడ్తాల్: మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల వ్యవసాయ పొలాల మీదుగా వేస్తున్న 765 కేవీ హైటెన్షన్ విద్యుత్‌లైన్ మార్చాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, రాజ్యసభ మాజీ సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో బాధిత రైతులు సోమవారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా తమ గోడు వెల్లబోసుకున్నారు. హైటెన్షన్ లైన్‌తో తీవ్రంగా నష్టపోతామని, అలైన్‌మెంట్ మార్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్పందించిన కేటీఆర్ బాధిత రైతులకు న్యాయం జరిగేవరకు న్యాయస్థానాల్లో పోరాడేందుకు కూడా తోడ్పాటునందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కేటీఆర్‌కు వినతిపత్రం అందిస్తున్న బాధిత రైతులు

సీజేఐపై దాడి యత్నానికి నిరసన

- కలెక్టరేట్ ఎదుట ఎంఆర్‌పీఎస్ ఆందోళన

ఇబ్రహీంపట్నం రూరల్: ఆధిపత్య శక్తుల ప్రభావంతోనే సీజేఐ గవాయిపై దాడి జరిగిందని, ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్ పేర్కొన్నారు. సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయిపై దాడి చేసిన అడ్వొకేట్ రాకేష్ కిషోర్‌ను కఠినంగా శిక్షించాలని కోరుతూ సోమవారం ఎంఆర్‌పీఎస్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో దళితుల ఆత్మగౌరవ నిరసన ప్రదర్శన ర్యాలీ నిర్వహించి, కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ.. బీఆర్ గవాయిపై జరిగిన దాడిని భారత న్యాయవ్యవస్థ మీద, రాజ్యాంగ స్ఫూర్తి మీద దాడిగా అభివర్ణించారు. కుల, మతాల పేరుతో విద్వేషాన్ని నింపుకొని దాడులకు దిగడం అనాగరికపు చర్యఅని పేర్కొన్నారు. ఈ ఘటనపై లోతైన విచారణ చేసి దాడి వెనక ఉన్న శక్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 17న అన్ని మండల కేంద్రాల్లో మండల కార్యాలయాలను ముట్టడిస్తామని, 22న చలో హైదరాబాద్ పేరుతో భారీ నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు బాబు, బత్తిన సుధాకర్, కృష్ణ, రవి, రమేష్, సతీష్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నల్ల జెండాలతో ధర్నా చేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

కేజీబీవీ విద్యార్థిని నూతన ఆవిష్కరణ



కందుకూరు కేజీబీవీ నుంచి వర్చువల్‌గా పాల్గొన్న విద్యార్థులు, అధికారులు

కందుకూరు: దేశవ్యాప్తంగా వర్చువల్‌గా నిర్వహించిన వికసిత్ భారత్ బిల్డాథాన్ 2025 కార్యక్రమం సోమవారం దేశవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులతో నిర్వహించారు. ప్రధాని మోదీ, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ పాల్గొనగా ఏఐఎం, నీతిఆయోగ్ ఆధ్వర్యంలో కార్యక్రమం కొనసాగింది. వర్చువల్‌గా నిర్వహించిన కార్యక్రమంలో కందుకూరు కేజీబీవీ విద్యార్థులు తమ ఆవిష్కరణలను వివరించారు. 9వ తరగతికి చెందిన కల్పన ×క్లాత్ ప్రొటెక్షన్ ఫ్రం రెయిన్' ప్రాజెక్టును ఆవిష్కరించింది. బట్టలు ఆరేసే తీగలకు సెన్సార్ ఏర్పాటు చేసి వర్షం కురిసినప్పుడు తడవకుండా అవంతట అవే నీడలోకి వచ్చి, మళ్లీ వర్షం తగ్గిన వెంటనే తిరిగి యథాస్థానంలోకి వచ్చేలా ఆవిష్కరణను వివరించి ఆకట్టుకుంది. వర్షం పడుతుండగానే తల్లి బట్టలు తడవకుండా పరుగులు తీసే దృశ్యం తనకు ప్రేరణ అయినట్లు తెలిపింది. తక్కువ ఖర్చుతో ఈ ప్రాజెక్టును రూపొందించినట్లు వివరించి అభినందనలు అందుకుంది. ఈ సందర్భంగా డీఈఓ సుశీంద్రరావు, జిల్లా సైన్స్ అధికారి ఎ.శ్రీనివాస్‌రావు, ఎంఈఓ హెచ్.నర్సింహులు, కేజీబీవీ జిల్లా డెవలప్‌మెంట్ అధికారి సుజాత, ప్రిన్సిపాల్ భార్గవి, లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ చీఫ్ మేనేజర్ రామ్ తదితరులు విద్యార్థినిని అభినందించారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి

షాబాద్: అసెంబ్లీ ఎన్నికల సమయంలో కామారెడ్డి సభలో కాంగ్రెస్ అగ్రనాయకులు బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం రెండోరోజు రిలే దీక్షలకు హాజరైన ఆయన మాట్లాడుతూ.. 40 ఏళ్లుగా బీసీలకు అన్యాయం చేస్తూ అణగదొక్కుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు న్యాయమైన వాటా అని, ఇందుకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలపాలన్నారు. 42 శాతం రిజర్వేషన్లు వచ్చే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి సభ్యులు జడల రాజేందర్‌గౌడ్, రాపోల్ నర్సింహులు, తమ్మలి రవీందర్, మాణెయ్య, రమేష్, దర్శన్, శేఖర్, కృష్ణ, రఘువరన్, నారాయణ, దీక్షలో రాము, వెంకటేశ్‌గౌడ్, రాములు, మల్లయ్య, మల్లేష్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

పార్టీకోసం పనిచేసేవారికి పెద్దపీట

- పారదర్శకంగా జిల్లా అధ్యక్షుడి ఎన్నిక
- ఏఐసీసీ పరిశీలకుడు, ఎంపీ రాబర్ట్ బ్రూస్



చేవెళ్ల: సమావేశంలో మాట్లాడుతున్న రాబర్ట్ బ్రూస్

చేవెళ్ల: పార్టీని పటిష్ట పరిచి రెండోసారి అధికారంలోకి తీసుకు వచ్చేందుకు జిల్లా కమిటీలో ఎన్నికైన అధ్యక్షులు పనిచేయాల్సి ఉంటుందని ఏఐసీసీ అబ్జర్వర్, తిరునల్వేలి ఎంపీ రాబర్ట్ బ్రూస్ అన్నారు. మండలకేంద్రంలో సోమవారం డీసీసీ అధ్యక్ష ఎన్నికపై అభిప్రాయసేకరణ సమావేశం నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి రాబర్ట్ బ్రూస్‌తోపాటు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, పీసీసీ ఉపాధ్యక్షులు వినయ్ రెడ్డి, విజయారెడ్డి, కార్పొరేషన్‌ల చైర్మన్‌లు ఒబెదుల్లా కొత్వాల్, చల్లా నర్సింహారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు అధ్యక్షుడిగా పోటీ చేయాలనుకునే వారు, పోటీ చేస్తున్న వారిలో ఎవరికి మద్దతిస్తున్నారు తదితరాలపై అభిప్రాయ సేకరణ చేశారు. ఈ సందర్భంగా రాబర్ట్ బ్రూస్ మాట్లాడుతూ.. పార్టీకోసం పనిచేసే నాయకులు, కార్యకర్తలకు అవకాశం కల్పించాలని.. ఎవరి ప్రమేయం, సిఫార్సులకు తావులేకుండా పారదర్శకంగా జిల్లా అధ్యక్షుల ఎన్నిక నిర్వహించనున్నట్టు తెలిపారు. జిల్లా పరిధిలోని 8 మంది ఎమ్మెల్యేలను గెలిపించుకునే విధంగా నాయకుడు ఉండాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి, పీసీసీ నా యకుడు జనార్దన్‌రెడ్డి, నియోజకవర్గ నాయకులు వసంతం, షాబాద్ దర్శన్, జిల్లా నాయకులు గౌరీ సతీష్, ఆగిరెడ్డి, పీఏసీఎస్, మార్కెట్ కమిటీల చైర్మ న్‌లు వెంకట్‌రెడ్డి, పెంటయ్యగౌడ్, సురేందర్‌రెడ్డి, చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ జె. శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశం రసాభాస

నియోజకవర్గంలో ఉన్న వర్గపోరు మరోసారి బయటపడింది. నేతల ప్రసంగాలు ముగిసిన అనంతరం పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ పార్టీలో బీసీలకు గౌరవం దక్కడం లేదని, అభిప్రాయ సేకరణలో కూడా ఒక వర్గం నాయకులకే అవకాశం ఎలా ఇస్తారని వాదించారు. దీంతో అక్కడే ఉన్న వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్‌రెడ్డి ఎమ్మెల్యే, మీరు పార్టీ సమావేశాలు పెట్టినప్పుడు మాకు సమాచారం ఇచ్చారా అని ప్రశ్నించారు. ఇరువురి వాదనలతో సమావేశం రసాభాసగా మారింది. దీంతో అద్దంకి దయాకర్, చల్లా నర్సింహారెడ్డి జోక్యం చేసుకుని వారిని శాంతింపజేశారు.

పాత.. కొత్త నాయకుల అభిప్రాయంతోనే..

శంకర్‌పల్లి: పార్టీలోని పాత, కొత్త నాయకుల సమష్టి అభిప్రాయంతోనే జిల్లా అధ్యక్షుడి ఎంపిక జరుగుతుందని ఏఐసీసీ, టీపీసీసీ పరిశీలకులు స్పష్టం చేశారు. సోమవారం పట్టణంలో డీసీసీ అధ్యక్షుడి ఎంపిక కోసం ముఖ్య నాయకులతో అంతర్గత సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీ రాబర్ట్ బ్రూస్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మరో ఇద్దరు పరిశీలకులు, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్యకర్తలు తమకు నచ్చిన వ్యక్తిని, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని బలమైన నాయకుడిని ఎంపిక చేసుకోవాలన్నారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్, నాయకులు మధుసూదన్‌రెడ్డి, గౌరీ సతీష్, ఉదయ్ మోహన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భీంభరత్ వ్యాఖ్యలు చర్చనీయాంశం

సమావేశం సందర్భంగా పామెన భీంభరత్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశం అయ్యాయి. పార్టీలోకి ఎంతో మంది వస్తారు, పోతారు.. ఎవరున్నా, లేకున్నా పార్టీ ఎక్కడికి పోదు అన్నారు. పదవుల విషయంలో ప్రతీసారి చేవెళ్ల నియోజకవర్గ నాయకులకు అన్యాయం జరుగుతోందని, ఈసారి డీసీసీ అధ్యక్ష పదవి ఇక్కడి నాయకులకు ఇవ్వాలని కోరారు. దీనిపై పరిశీలకులు స్పందిస్తూ హైకమాండ్ దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

పర్యావరణ పరిరక్షణ సమష్టి బాధ్యత

అడిషనల్ డీఆర్‌డీఓ సుభాషిణి


యాచారం: మొక్క నాటుతున్న అడిషనల్ డీఆర్‌డీఓ సుభాషిణి తదితరులు

యాచారం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో విరివిగా మొక్కలు నాటాలని అడిషనల్ డీఆర్‌డీఓ సుభాషిణి సూచించారు. సోమవారం మండల పరిధిలోని గునుగల్, యాచారం గ్రామాల్లోని జీపీ ల్యాండ్స్, వెంచర్లలోని పది శాతం భూముల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గ్రామాల్లో ఏర్పాటయ్యే వెంచర్లలో పంచాయతీలకు రిజిస్ట్రేషన్లు చేసిన పది శాతం భూముల్లో విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. గ్రామాల్లోని కాలనీలు, రోడ్ల వెంట, పార్క్ స్థలాల్లో మొక్కలు నాటాలని చెప్పారు. మొక్కలు నాటడమే కాదు.. సంరక్షణ చేయాల్సిన బాధ్యత మనదేనని అన్నారు. ఈజీఎస్ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకం చేపడుతున్నామని, అర్హులైన ఆసక్తి కలిగిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాధారాణి, ఈజీఎస్ ఏపీఓ లింగయ్య, ఈసీ శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

మంచాల: గ్రామాల్లో మొక్కల పెంపకం ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి సుభాషిణి అన్నారు. సోమవారం మండలంలోని ఆగాపల్లి, కాగజ్‌ఘట్ గ్రామాల్లో ఎన్‌ఆర్ ఈజీఎస్ పథకం కింద నాటిన మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొక్కలు నాటడమేగాకుండా వాటిని సంరక్షణ బాధ్యత కూడా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ వీరాంజనేయులు, ఈసీ విమల, పంచాయతీ కార్యదర్శులు అనిల్, శ్రీను, హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.



పోలీస్ బెటాలియన్ ఆత్మీయ కలయిక

ఏపీఎస్‌పీ 8వ బెటాలియన్ పోలీసులు 30 ఏళ్ల తరువాత ఆత్మీయంగా కలుసుకున్నారు. కొండాపూర్ 1995 బ్యాచ్‌కు చెందిన పోలీసులు మొయినాబాద్‌లోని ఓ ఫాంహౌస్‌లో కలుసుకుని 30 ఏళ్ల వేడుకలు నిర్వహించుకున్నారు. యోగక్షేమాలు తెలుసుకుంటూ ఆత్మీయ పలకరింపులతో రోజంతా ఉత్సాహంగా గడిపారు - మొయినాబాద్

భూమి పోతుందనే భయంతో..

గుండెపోటుతో వృద్ధుడి మృతి

కొందుర్గు: రేడియల్ రోడ్డులో తన భూమి పోతుందనే భయంతో ఓ వృద్ధుడు గుండెపోటుతో మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. మండలంలోని ఉమ్మెంత్యాల గ్రామానికి చెందిన వడ్ల మోనయ్య(68) సోమవారం రాత్రి ఇంట్లో టీవీ చూస్తుండగా గుండెలో నొప్పి వచ్చింది. కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా కొందుర్గు పీహెచ్‌సీకి తీసుకెళ్లే లోపే ఆయన మృతిచెందాడు. మృతుడికి భార్య జయమ్మతోపాటు, ముగ్గురు కుమారులు ఉన్నారు. అయితే రెండు రోజుల క్రితం ఉమ్మెంత్యాల శివారులో రేడియల్ రోడ్డు కోసం మార్కింగ్ వేశారు. ఈ రోడ్డులో తన భూమి పోతుందని మోనయ్య రెండురోజుల నుంచి బాధపడ్డారు. భూమి పోతుందనే ఆందోళనలోనే గుండెపోటుతో మృతి చెందాడని మృతుడి కుటుంబ సభ్యులు వాపోయారు.

నాగర్‌గూడ వైన్స్‌లో చోరీ


వైన్స్ వద్ద వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

షాబాద్: గుర్తు తెలియని వ్యక్తులు వైన్స్‌లో దూరి చోరీ చేసిన సంఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నాలుగేళ్లుగా మండలంలోని మద్దూరు గ్రామానికి చెందిన కప్ప హరిబాబు నాగర్‌గూడ దుర్గా వైన్స్‌లో పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే ఆదివారం రాత్రి వైన్స్ బంద్ చేసి ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం వైన్స్‌లో దొంగలు పడ్డారని స్థానికులు తెలపడంతో హరిబాబు అక్కడికి వెళ్లాడు. దుండగులు రాత్రివేళ వైన్స్ వెనకాల గోడకు రంధ్రం చేసి షాపులో దూరి కౌంటర్‌లో ఉన్న రూ.43 వేలను ఎత్తుకెళ్లారు. నిర్వాహకులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్రాప్ సర్వేతో మేలు

వైపరీత్యాల సమయంలో త్వరగా పరిహారం

- పంటలు లాభాలకు అమ్ముకునే వెసులుబాటు
- నమోదు చేసుకోవాలని అధికారుల సూచన


క్షేత్రస్థాయిలో క్రాప్ సర్వే చేస్తున్న వ్యవసాయ అధికారులు (ఫైల్)

కొత్తూరు: రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను సమగ్రంగా తెలుసుకుని వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి ప్రారంభమైంది. ఆ వివరాలను శాటిలైట్‌కు అనుసంధానం చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం డిజిటల్ క్రాప్ సర్వేకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే మండలంలో సర్వే తుది అంకానికి చేరుకుంది. మండలంలో సాగుకు యోగ్యమైన భూమి 8,900 ఎకరాలు ఉండగా ఈ ఏడాది 8,800 ఎకరాల్లో రైతులు ఆయా రకాల పంటలను సాగు చేశారు. కాగా ఇప్పటికే వ్యవసాయ అధికారులు 8,200 ఎకరాల్లో సాగు చేసిన పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. మిగిలిన 600 ఎకరాల్లో సాగు చేసిన వివరాలను త్వరలో పూర్తి చేయనున్నారు.

సర్వేతో ప్రయోజనాలు

- కేంద్ర ప్రభుత్వం అమలు చేసే పలు పథకాలకు ఈ సర్వేను ప్రామాణికంగా తీసుకుని రైతులకు న్యాయం చేస్తారు.
- క్రాప్ సర్వేతో రైతులు ఎన్ని ఎకరాల్లో ఏఏ పంటలు సాగు చేశారో? అన్ని వివరాలు సమగ్రంగా అధికారుల వద్ద ఉంటాయి.
- పంట దిగుబడి సమయంలో రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా నేరుగా మార్కెట్‌లో తమ పంటలను విక్రయించుకునేందుకు వీలు కల్పిస్తున్నారు.
- సర్వేను ప్రామాణికంగా తీసుకుని భవిష్యత్తులో రైతులకు అవసరమైన ఎరువులు, ఇతర అవసరాలను తీర్చడానికి సర్వే అంశాలు చాలా వరకు ఉపయోగపడతాయి.
- ప్రకృతి వైపరీత్యాలు చోటు చేసుకున్నప్పుడు రైతులకు త్వరగా పరిహారం అందించడంలో సర్వే వివరాలు దోహదపడతాయి.
- క్రాప్ సర్వే ఆధారంగా రైతులు నష్టపోయే పంటలను సాగు చేయకుండా చూడవచ్చు.
- అదే సమయంలో మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను గుర్తించి వాటిని సాగు చేసే విధంగా వారిని ప్రోత్సహించవచ్చు.

నమోదు చేశాం



ఈ ఏడాది సెప్టెంబర్‌లో ప్రారంభమైన క్రాప్ సర్వే మండలంలో దాదాపు పూర్తయింది. 8,800 ఎకరాల్లో పంటలు సాగు చేయగా ఇప్పటివరకు 8,200 ఎకరాల్లో సాగు చేసిన పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. క్రాప్ సర్వేతో రైతులకు బహుళ ప్రయోజనాలున్నాయి.
– గోపాల్‌నాయక్, ఏఓ., కొత్తూరు

- మండలంలోని క్లస్టర్ల వారీగా ఏఈవోలు తమకు కేటాయించిన గ్రామాల్లో మొబైల్ యాప్‌తో పంటలను సర్వే చేయాలి. అనంతరం సర్వే నంబర్ల వారీగా పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు.

ఇలా వచ్చి.. అలా వెళ్లిపోయి!

- డీసీసీ అభిప్రాయ సేకరణ సమావేశానికి కాలె యాదయ్య
- అబ్జర్వర్లను కలిసి వెళ్లిపోయిన వైనం


అబ్జర్వర్లు రాబర్ట్ బ్రూస్, నర్సింహారెడ్డి, అద్దంకి దయాకర్‌ని కలిసి వెళ్తున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల: డీసీసీ అధ్యక్ష ఎన్నికపై సోమవారం చేవెళ్లలో నిర్వహించిన అభిప్రాయ సేకరణ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భీం భరత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి అధిష్టానం పంపించిన పార్టీ అబ్జర్వర్లు హాజరయ్యారు. మీటింగ్ మధ్యలో అక్కడికి చేరుకున్న లోకల్ ఎమ్మెల్యే యాదయ్య వచ్చిన అతిథులకు నమస్కరించి, కరచాలనం చేసి వెళ్లిపోయారు. పార్టీ ఫిరాయింపుల కేసు నేపథ్యంలోనే ఆయన మీటింగ్‌లో కూర్చోలేదని అక్కడున్న నేతలు గుసగుసలాడారు. ఇదిలా ఉండగా.. తాను పార్టీ మారలేదని చెప్పుకొంటున్న ఎమ్మెల్యే కాంగ్రెస్ మీటింగ్‌కు ఎందుకు వచ్చారో ఆయనకే తెలియాలని భీంభరత్ వర్గం అసహనం వ్యక్తం చేయగా, తన వర్గానికి నేనున్నానని సంకేతాన్నిచ్చేందుకే యాదయ్య ఇలా వచ్చి అలా వెళ్లిపోయారని కాంగ్రెస్‌లో చర్చ సాగింది.

అక్రమ కట్టడాలు తొలగించండి


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

కొత్తూరు: పాత మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే రోడ్డులో ప్రభుత్వ పాఠశాల గేటుకు ఇరువైపులా ఉన్న అక్రమ కట్టడాలను తొలగించాలని స్థానికులు సోమవారం కమిషనర్ బాలాజీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్యాలయానికి వెళ్లే రోడ్డు ఇరుకుగా ఉందన్నారు. దానికి తోడు చిరు వ్యాపారులు ఇరువైపులా కూరగాయలు విక్రయిస్తుండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఇదే అదునుగా కొందరు రోడ్డుకు ఇరువైపులా డబ్బాలు, అక్రమ కట్టడాలు నిర్మించడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందన్నారు. మున్సిపాలిటీ అధికారులు అక్రమంగా వెలసిన కట్టడాలను తొలగించిన తర్వాత రోడ్డు విస్తరణ చేపట్టాలని కోరారు. లేని పక్షంలో ధర్నాలు, ఆందోళనలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రావణ్‌కుమార్, కార్తీక్‌రెడ్డి, కుమార్, నర్సింహ, సురేందర్, రాజు పాల్గొన్నారు.

కారు-ఆటో ఢీ..

భార్యాభర్తలకు గాయాలు

ఆమనగల్లు: ఆటోను కారు ఢీకొట్టిన ప్రమాదంలో ఓ దంపతులు తీవ్రంగా గాయపడిన సంఘటన తలకొండపల్లి మండలం చుక్కాపూర్ గ్రామశివారులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన భార్యాభర్తలు అశోక్‌రెడ్డి, సుమతమ్మ సోమవారం సమీపంలోని తమ వ్యవసాయ పొలంలో పచ్చిగడ్డి కోసుకుని ఆటోలో గ్రామా నికి వస్తుండగా ఆమనగల్లు నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో ఆటో కొద్ది దూరం వెళ్లి పల్టీ కొట్టడంతో దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గుర్తించిన గ్రామస్తులు వెంటనే ఇరువురిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఆర్టీసీ డ్రైవర్ మృతి


కిషన్ (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని రాందాస్‌పల్లికి చెందిన కంతి కిషన్ (50) సోమవారం ఉదయం మృతిచెందాడు. ఇబ్రహీంపట్నం డిపోలో విధులు నిర్వర్తిస్తున్న కిషన్‌కు రెండు రోజుల క్రితం గుండెపోటు రావడంతో ఆస్పత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ చనిపోయాడు. బీఆర్ఎస్ నాయకు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, కొప్పు జంగయ్య తదితరులు మృతదేహం వద్ద నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ప్రైవేటు హాస్టల్‌లో యువకుడి ఆత్మహత్య

- ల్యాండ్ సర్వేయర్‌గా పనిచేస్తున్న మృతుడు
- ఆర్థిక ఇబ్బందులే కారణమని అనుమానం

పహాడీషరీఫ్: ప్రైవేటు హాస్టల్‌లో ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం చేసుకుంది. ఎస్‌ఐ దయాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరు మండలం చంద్రవంశ గ్రామానికి చెందిన కిష్టప్ప కుమారుడు భానుప్రసాద్(25) కందుకూరు మండలం రాచులూర్‌లోని ఓ వెంచర్‌లో కొద్ది రోజులుగా ల్యాండ్ సర్వేయర్‌గా పనిచేస్తూ, తుక్కుగూడలోని సాయిబాలాజీ హాస్టల్‌లో మరో నలుగురు యువకులతో కలిసి నివాసం ఉంటున్నాడు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు హాస్టల్‌కు చేరుకున్న భానుప్రసాద్ రూమ్ మేట్లు బయటికి వెళ్లిన సమయంలో తలుపులు వేసుకొని దుప్పటితో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సాయంత్రం వరకూ తలుపులు తెరువకపోవడంతో స్నేహితులు వచ్చి, తలుపులు నెట్టి చూడగా ఉరేసుకొని కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా అనంతరం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. తన తండ్రి గొంతుకు గడ్డలు అయ్యాయని, తాను పనిచేసే చోట డబ్బులు అడ్వాన్స్‌గా తీసుకొని చికిత్స చేయిస్తానని.. కొన్ని అప్పులు కూడా ఉన్నట్లు రూమ్‌లో ఉండే తమతో చెప్పేవాడని స్నేహితులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఫిలింనగర్‌లో రూ.లక్ష నగదు పట్టివేత

బంజారాహిల్స్: ఫిలింనగర్‌లోని అపర్ణ సినార్ వ్యాలీ చౌరస్తాలో ఆదివారం అర్ధరాత్రి ఓ యువకుడి బైక్‌ను ఆపి తనిఖీలు చేయగా బ్యాగ్‌లో రూ.లక్ష తీసుకెళ్తూ పట్టుబడ్డాడు. త్రిపుల్ ఎస్ వైన్‌షాపులో క్యాషియర్‌గా పనిచేస్తున్న భాస్కర్ షాపు మూసివేసిన అనంతరం ఆ రోజు కలెక్షన్‌ను తీసుకెళ్తున్నట్లుగా వెల్లడించాడు.

బైక్‌ను ఢీకొట్టిన బస్సు

ముగ్గురికి తీవ్ర గాయాలు


ఘటనాస్థలిలో క్షతగాత్రులు

కొత్తూరు: ముందు వెళ్తున్న బైక్‌ను గుర్తు తెలియని బస్సు ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన కొత్తూరు పట్టణంలోని పెంజర్ల కూడలి జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. దేవరకద్ర మండలం లక్ష్మీపల్లి గ్రామానికి చెందిన నవీన్(40), మల్లేష్(45) అన్నదమ్ములు. వీరు కొన్నేళ్ల నుంచి రాజేంద్రనగర్ సమీపంలోని కాటేదాన్‌లో ఉంటున్నారు. ఆదివారం తమ స్వగ్రామంలో ఓ శుభకార్యం ఉండడంతో ఇద్దరితో పాటు మల్లేష్ కుమారుడు లోకేష్(12) బైక్‌పై వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ముగ్గురు బైక్‌పై బయలుదేరగా పట్టణంలోని పెంజర్ల కూడలి వద్దకు రాగానే వెనకాల నుంచి వచ్చిన గుర్తు తెలియని బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో ఉస్మానియాకు తరలించారు.

హత్య కేసులో నిందితురాలి అరెస్టు

14 రోజుల రిమాండ్ తరలింపు


నిందితురాలు మాధవి

కేశంపేట: భర్తను హత్య చేసిన ఘటనలో నిందితురాలైన భార్యను కేశంపేట పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ నరహరి కథనం ప్రకారం.. మండలం కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన కొప్పు కుమార్(35) రోజూ మద్యం తాగి భార్య మాధవిని వేధిస్తుండేవాడు. ఈ నెల 11న రాత్రి సైతం మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యతో గొడవ పడ్డాడు. భర్తను ఎలాగైనా అంతం చేయాలని భావించిన మాధవి అర్ధ రాత్రి నిద్రిస్తున్న సమయంలో అతని తల, ఛాతిపై సిమెంట్ ఇటుకతో బలంగా మోదింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఆమె మృతదేహాన్ని బయటికి ఈడ్చుకుంటూ వచ్చి ఇంటి ముందు ఉన్న నీటి సంపులో పడేసినట్లు తెలిపారు. ఇంట్లో ఉన్న రక్తం మరకలను తుడిచి, పౌడర్‌ను చల్లి ఆధారాలు దొరకకుండా చేసి పరారైనట్లు పోలీసులు చెప్పారు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు జంగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. కేశంపేట వైఎస్ఆర్ చౌరస్తా వద్ద మాధవిని సోమవారం అదుపులోకి తీసుకొని విచారించగా.. ఆమె నేరాన్ని అంగీకరించారు. ఈ మేరకు ఆమెను కోర్టులో హాజరు పర్చారు. న్యాయమూర్తి 14రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


శేఖర్ (ఫైల్)

కడ్తాల్: గుర్తుతెలియని కారు- బైకు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. సీఐ గంగాధర్ తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన జల్కం శేఖర్(36) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం పొలం పనులు ముగించుకుని, తన ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తుండగా, శ్రీలక్ష్మి వెంచర్‌లోని మెకానిక్ షాపు సమీపంలో గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. తీవ్ర గాయాలపాలైన శేఖర్‌ను 108 వాహనంలో మహేశ్వరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య శివలీల, కూతురు, కుమారుడు ఉన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కన్న కొడుకుకు తల్లి తలకొరివి


నేదునూరులో కొడుకు శవయాత్రలో తల్లి

కందుకూరు: అనారోగ్యంతో మరణించిన కొడుకుకు తల్లి తలకొరివి పెట్టిన విషాద ఘటన మండల పరిధిలోని నేదునూరులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గంగుల నాగభూషణ్‌రెడ్డి, బాలమణికి దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు. నాగభూషణ్‌రెడ్డి ఇరవై ఏళ్ల క్రితం మృతి చెందగా, ఐదేళ్ల క్రితం చిన్న కూతురు చనిపోయింది. పెద్ద కూతురుకు వివాహం చేసి అత్తవారింటికి పంపగా, కొడుకు భాస్కర్‌రెడ్డి (30)తో కలిసి వ్యవసాయ పనులు చేసుకుంటూ గ్రామంలోనే నివసిస్తున్నారు. కొద్ది రోజులుగా అనారోగ్యం బారిన పడిన కొడుకు సోమవారం ఉదయం మరణించాడు. దీంతో తల్లి బాలమణి తలకొరివి పెట్టి, అంతిమ సంస్కారాలు పూర్తి చేసింది.

తప్పిపోయిన వ్యక్తి అప్పగింత


తప్పిపోయిన వ్యక్తిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

మంచాల: ఏడాది కిందట తప్పిపోయిన ఓ వ్యక్తిని కుటుంబ సభ్యులకు అప్పగించిన సంఘటన మంచాల పోలీస్‌స్టేషన్‌లో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా జగ్గసాగర్ గ్రామానికి చెందిన పూసల నరేందర్ ఉపాధి నిమిత్తం ఏడాది క్రితం హైదరాబాద్‌కు వచ్చాడు. రోడ్డు ప్రమాదంలో కాలు విరిగిపోవడమే గాకుండా మతి స్థిమితం కోల్పోయాడు. దీంతో భిక్షాటన చేస్తూ మండలంలోని ఆగాపల్లి సమీపంలో కనిపించాడు. స్థానికుల సహాయంతో దయనీయ స్థితిలో ఉన్న నరేందర్‌ను మానవ సేవ ఆశ్రమం నిర్వాహకులు చేరదీశారు. 2025 జనవరిలో వారి కుటుంబ సభ్యులు మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో నరేందర్ తప్పిపోయినట్లు ఫిర్యాదు చేశారు. కేసు విచారణలో భాగంగా ఆగాపల్లిలో మానవ సేవ ఆశ్రమంలో ఉన్నట్లు గుర్తించారు. నరేందర్‌ను వివరాలు అడిగి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సోమవారం కుటుంబ సభ్యులైనా భార్య శ్రీలత, బావమరిది అనిల్‌కుమార్ రావడంతో అప్పగించారు. ఏడాది తర్వాత నరేందర్ కలవడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ సతీష్ తదితరులు ఉన్నారు.

నేత్రదానానికి ముందుకు రావాలి



ఆమనగల్లులో కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న చంద్రశేఖర్

ఆమనగల్లు: నేత్రదానం చేయడానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ చంద్రశేఖర్ కోరారు. పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో సోమవారం ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. నేత్ర, అవయవదానంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. తమ మరణానంతరం నేత్రదానం చేయడం ద్వారా మరో ఇద్దరికి దృష్టి భాగ్యం కలుగుతుందని చెప్పారు. శిబిరంలో కంటి వైద్యులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 65 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. ఇందులో 15 మందిని కంటి ఆపరేషన్ల నిమిత్తం ఎనుగొండలోని రాంరెడ్డి లయన్స్‌కంటి ఆసుపత్రికి పంపించారు. కార్యక్రమంలో ఆమనగల్లు ప్రభుత్వాసుపత్రి వైద్యురాలు మైమునాబేగం, ఎంపీహెచ్ఈఓ తిరుపతిరెడ్డి, లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు బాలకృష్ణ, కార్యదర్శి వెంకటయ్య, పీఆర్‌ఓ పాషా, మాజీ అధ్యక్షుడు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన రెండు గంటల్లోనే చోరీ

ఇబ్రహీంపట్నం: తాళం వేసిన రెండు గంటల్లోనే దుండగులు ఓ ఇంటికి కన్నం వేసి బంగారం, వెండి ఆభరణాలు అపహరించిన సంఘటన ఇబ్రహీంపట్నంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. స్థానిక బోయివాడలో నివసించే యెలమోని రవీందర్ కుటుంబసభ్యులు ఆదివారం ఊరికి వెళ్లారు. ఇంటి వద్ద ఉన్న అతని కుమారుడు కార్తిక్ సోమవారం మధ్యాహ్నం 3.40 గంటలకు తాళం వేసి బావి వద్దకు పొలం పనికి వెళ్లారు. ఊరెళ్లిన రవీందర్ సాయంత్రం 5 గంటలకు ఇంటికొచ్చే సరికి తాళం పగలు గొట్టి ఉంది. బీరువాలో వస్తువులు అన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. సుమారు 11 తులాల బంగారు, 5 వెండి ఆభరణాలతో పాటు రూ.65 వేల నగదు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.